గొంతెండుతోంది!



కందుకూరు చౌరస్తాలోని ఎస్ఎల్ జంగారెడ్డి కాలనీలో వృథాగా ఉన్న ఓహెచ్ఎస్ఆర్

- కందుకూరు చౌరస్తాలో వారానికోసారి నీటి సరఫరా
- వేసవికి ముందే అవస్థలు మొదలు
- అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుల ఆందోళన
- వృథాగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు

కందుకూరు: తాగునీటి సమస్యతో స్థానిక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు అరకొర నీటి సరఫరాతో చేతులు దులుపుకొంటున్నారు. దీంతో వేసవికి ముందే గొంతెండుతోందని పలు కాలనీల వాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

జనాభా అధికం..

కందుకూరు పంచాయతీతో పాటు స్థానిక చౌరస్తా వద్ద ఎక్కువ జనాభా నివసిస్తోంది. 2011 లెక్కల ప్రకారం కేవలం కందుకూరు చౌరస్తాలోనే 780 మంది ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రస్తు తం ఈ సంఖ్య మూడింతలు పెరిగింది. మండలంలోని గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న ఎంతో మంది ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పా టు చేసుకుంటున్నారు. వీరి ఓటు హక్కు స్వగ్రామాల్లో ఉండగా.. ఇక్కడే ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. వీరందరికీ సరిపడా తాగు నీటిని సరఫరా చేయలేకపోతున్నారు. మిషన్ భగీరథ నుంచి వచ్చే నీరు కాలనీల వారీగా వారానికి ఒకసారి మాత్రమే సరఫరా అవుతోంది. ఫలితంగా తాగునీటికి తిప్ప లు తప్పడంలేదు. బోర్లు ఉన్న వారి ఇళ్ల నుంచి ఎంతో కొంత నగదు చెల్లించో లేక బతిమిలాడో నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

వృథాగా ఓహెచ్ఎస్ఆర్

కందుకూరు చౌరస్తాలోని ఎస్ఎల్ రంగారెడ్డి కాలనీలో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఓహెచ్ఎస్ఆర్ నిర్మించి దాదాపు రెండేళ్లవుతోంది. అయినా ఇంత వరకు దీంట్లో నీళ్లు నింపి సరఫరా చేయలేదు. ప్రస్తుతం ట్యాంకు వృథాగానే మారింది. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



కందుకూరు చౌరస్తాలోని యాదగిరిరెడ్డి నగర్‌లో వృథాగా మారిన మినీ ట్యాంకు

ఐదారు రోజులకు ఒకసారి



తాగునీటితో చాలా ఇబ్బంది పడుతున్నాం. పంచాయతీ నల్లా నుంచి ఐదారు రోజులకు ఒకసారి మాత్రమే నీళ్లు వస్తున్నాయి. సమీపంలోని బోర్లు ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లి బతిమాలి, బిందెలతో తాగునీరు తెచ్చుకుంటున్నాం. మా సమస్య పరిష్కరించాలి.

– రాయికంటి లక్ష్మమ్మ, యాదగిరిరెడ్డినగర్

పైసలు ఇచ్చి తెచ్చుకుంటున్నాం



పంచాయతీ నుంచి వారానికి ఒకసారి మాత్రమే నల్లాల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. అది కూడా పావు గంటలో పది బిందెలు మాత్రమే వస్తున్నాయి. బోర్లు ఉన్న వాళ్లకు పైసలిచ్చి తాగు నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– యాదీలాల్, కందుకూరు చౌరస్తా

సమస్యను పరిష్కరిస్తాం

కందుకూరు చౌరస్తాలో 2011 సంవత్సరం లెక్కల ఆధారంగా మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోంది. అక్కడ ఉన్న ఓహెచ్ఎస్ఆర్‌తో పాటు మరో సంపుతో నీటిని సరఫరా చేస్తే సరిపోవడం లేదు. ఎస్ఎల్ రంగారెడ్డి కాలనీలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ ఇంకా ట్రయల్ రన్ చేయకపోవడంతోనే సమస్య వచ్చింది. ఆ ట్యాంక్‌లోకి నీరు ఎక్కించి సరఫరా చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

– సురేందర్ పంచాయతీ కార్యదర్శి, కందుకూరు

క్లుప్తంగా

నేడు తుక్కుగూడకు కేటీఆర్ రాక

తుక్కుగూడ: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మున్సిపాలిటీలో జరిగే పార్టీ సమావేశానికి ముఖ్య అతిథిగా వస్తున్నట్లు ఆ పార్టీ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పుర పరిధిలోని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

రేపు బేగంపేటలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

కందుకూరు: మండల పరిధిలోని బేగంపేటలో ఈ నెల 19వ తేదీన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, అభిమానులు పెద్దఎత్తున తరలి రావాలని నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సేవా ప్రముఖ్ శివశంకర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. వివిధ గ్రామాల నుంచి కారు, బైక్ ర్యాలీలు నిర్వహించనున్నామని, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, సామాజిక సేవకులు, శివాజీ మహారాజ్ అభిమానులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అసంపూర్తిగా యూజీడీ పనులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ శ్రీమారుతీనగర్ కాలనీలో డ్రైనేజీ పనులు అసంపూర్తిగా వదిలివేశారని బీజేపీ బీసీ మోర్చా జిల్లా మాజీ కార్యవర్గ సభ్యుడు అగిరిశెట్టి సైదులు ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. శ్రీమారుతీనగర్‌లో మొత్తం 11 వీధి రోడ్లు ఉన్నాయని, కొన్ని సంవత్సరాలుగా డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. మొదటి నుంచి అవుట్ లేకుండా ఈ కాలనీకి ఇటీవల అవుట్‌లెట్ కలపడం సంతోషమన్నారు. కాలనీలోని కొన్ని లింకు రోడ్లకు డ్రైనేజీలు కలిసి కొన్ని రోడ్లకు డ్రైనేజీ లింకులు లేకుండా వదిలివేశారన్నారు. డ్రైనేజీ పనులు కూడా అర్ధంతరంగా నిలిపివేశారని గుర్తుచేశారు. అధికారులు స్పందించి మొదలుపెట్టిన అన్ని డ్రైనేజీ పనులు పూర్తిచేయాలని అధికారులను కోరారు.

ఉచిత పశువైద్య శిబిరం



రైతులకు మందులు అందిస్తున్న పశువైద్యులు

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లిలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యులు రేవతి, సంధ్య పాల్గొని గ్రామంలో మొత్తం 56 పశువులకు చికిత్స అందించారు. రైతులకు పశు పోషణలో మెలకువలు, సలహాలు, సూచనలు తెలియజేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, రైతులు ఇటమోని యాదయ్యయాదవ్, ప్రశాంత్, గణేశ్, జంగయ్య, వైద్య సిబ్బంది మాధవి, అప్సర్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘం మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ తదితరులు

కందుకూరు: కందుకూరు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమైన పంచాయతీ కార్యదర్శులు కమిటీని ఎన్నుకొని ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడిగా వి.సురేందర్‌గౌడ్(కందుకూరు), ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాస్‌గౌడ్(బాచుపల్లి), ఆర్.ఉమాదేవి(కొత్తగూడ), కోశాధికారిగా కె.మహేశ్‌బాబు(బైరాగిగూడ), ప్రధాన కార్యదర్శిగా పి.శ్రీను(చిప్పలపల్లి), ప్రచార కార్యదర్శులుగా జి.రాఘవేందర్(మురళీనగర్), ఆర్.సురేందర్(బేగరికంచె), సలహాదారుడిగా కె.శ్రీహరి(దెబ్బడగూడ), మీడియా కన్వీనర్‌గా టీజీ సెల్వమణి(బేగంపేట)ని ఎన్నుకున్నారు. కాగా నూతన కమిటీని ఎంపీడీఓ సరిత, ఎంపీఓ గీత సన్మానించి అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ డెంటల్ కళాశాల, హుడాకాంప్లెక్స్, కమలానగర్, నర్సింహపురికాలనీ, నేతాజీనగర్, పుష్పాగార్డెన్స్, సరూర్‌నగర్, శారదానగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా పెద్దమ్మ బోనాలు



పూజల్లో పాల్గొన్న నాయకులు

పహాడీషరీఫ్: మామిడిపల్లి సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్‌లో గల పెద్దమ్మ తల్లి ఆలయంలో సోమవారం అమ్మవారి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధల మధ్య మహిళలు అమ్మవారికి బోనాలు తీసుకొచ్చి నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్‌గౌడ్, నాయకులు రమేశ్‌గౌడ్, గుజ్జుల పద్మారావు, ఈసంపల్లి కృష్ణగౌడ్, సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మార్మోగిన శివనామస్మరణ



మొయినాబాద్‌రూరల్: ఇరుముళ్లతో శ్రీశైలం బయలుదేరిన శివస్వాములు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని చాకలిగూడ గ్రామంలో దాదాపు 15 మంది శివమాల ధరించిన భక్తులు ఇరుముళ్లతో శ్రీశైలం బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామంలో గల శివాలయంలో ఇరుముళ్ల మహాపడి పూజను భక్తులు వైభవంగా నిర్వహించారు. దీంతో గ్రామ వీధులు శివనామస్మరణతో మార్మోగాయి. కార్యక్రమంలో నాయకులు రెడ్డిమోని యాదయ్య పాల్గొన్నారు.

వీరన్నకు ప్రత్యేక పూజలు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల గ్రామంలో సోమవారం గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో శివస్వాములు వీరన్నస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలచారి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం శివ మండల దీక్షల సమయంలో గ్రామదేవతలకు పూజలు నిర్వహించి శ్రీశైలం వెళ్తారన్నారు. శివభక్తులు నియమనిష్టలతో దీక్షలు పూర్తిచేస్తే మోక్షం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో శివస్వాములు నర్సింలు, బుగ్గయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దైవచింతన అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని కౌకుంట్ల గ్రామంలో జరుగుతున్న నాబి శిల, ధ్వజస్తంభ, పోతురాజు విగ్రహాల పునప్రతిష్ఠ మహోత్సవ పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పూజలతో గ్రామం భక్తిభావంతో నిండిపోయింది.ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి సబితారెడ్డి స్వగ్రమమైన కౌకుంట్లలో జరుగుతున్న ఈ పూజల్లో ఆమె తనయుడు పి.కార్తీక్‌రెడ్డి దంపతులు, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సబితారెడ్డి చొరవతోనే నిధులు మంజూరు

- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి

మహేశ్వరం: తుమ్మలూరు–మహేశ్వరం బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రత్యేక చొరవతోనే 14.20 కోట్ల నిధులు మంజూరయ్యాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంట వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన తుమ్మలూరులో మాట్లాడుతూ.. తుమ్మలూరు గ్రామంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే తుమ్మలూరు గేటు(శ్రీశైలం జాతీయ రహదారి) నుంచి మహేశ్వరం మండల కేంద్రం వయా తుమ్మలూరు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని విమర్శించారు. సబితారెడ్డి హయాంలో తుమ్మలూరులో రాజోలు కట్ట మీదుగా సీసీరోడ్డు నిర్మాణం, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు, సీసీరోడ్లు, డ్వాక్రా భవన నిర్మాణం, మ్యాక్ ప్రాజెక్టులో సబ్ స్టేషన్ నిర్మాణంతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

మట్టి టిప్పర్లను అదుపు చేయాలని వినతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్ సాయిప్రభ హోమ్స్ కాలనీ మీదుగా టిప్పర్ లారీలు నిత్యం వస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయని సోమవారం కాలనీవాసులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాయిప్రభహోమ్స్ కాలనీ మీదుగా కొత్త మున్సిపల్ కార్యాలయానికి రోడ్డు ఉంది. అయితే కొందరు వెంచర్ నిర్వాహకులు తమ పనుల నిమిత్తం మట్టి ట్రాక్టర్లు, టిప్పర్లు, డీసీఎం, లారీలు నిర్విరామంగా మట్టిని తరలించడంతో శబ్దకాలుష్యంతో పాటు ఇళ్ల ముందు మట్టి పేరుకుపోతుందని వాపోయారు. తెల్లవారుజాము నుంచే ఈ తాకిడి పెరిగిపోతుండటంతో పరీక్షల సమయాల్లో విద్యార్థులు ఇళ్లల్లో ఉండి చదువుకోలేకపోతున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకొని వాహనాలు రాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కృష్ణసాగర్, జనరల్ సెక్రటరీ అశోక్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ కృష్ణయాదవ్, జి.విద్యాసాగర్, సంపత్‌కుమార్, భిక్షపతి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

శంకర్‌పల్లి: మండలంలోని మహాలింగాపురం, కొత్తపల్లి గ్రామాల్లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే 10వ తరగతి విద్యార్థులకు హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ట్రస్ట్ ద్వారా ఇప్పటికే ఎంతో మంది విద్యార్థులకు సాయం చేశామని, భవిష్యత్‌లో ఇంకా విద్యార్థులకు సహకారం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సభ్యులు, పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.



మహాలింగాపురం పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు



కందుకూరు: విద్యార్థులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న మాజీ సర్పంచ్ జంగయ్య



పహాడీషరీఫ్: జల్‌పల్లి కమాన్ వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు



పహాడీషరీఫ్: వాదే ముస్తఫా బస్తీలో కేక్ కట్ చేస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ అఫ్జల్

కారణజన్ముడు కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం మహేశ్వరం నియోజకవర్గంలోఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. పలు గ్రామాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వృద్ధాశ్రమాలు, అనాథ ఆశ్రమాలు, పీహెచ్‌సీల్లో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహానేత కేసీఆర్ అని, ఆయన పేరు చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికలతో పాటు రాష్ట్రంలో ఏలేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు.



మహేశ్వరం: కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తుక్కుగూడ: రావిర్యాలలో పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



హుడాకాంప్లెక్స్: వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకుడు కొండల్‌రెడ్డి



బడంగ్‌పేట్: కేక్ కట్‌చేసి తినిపించుకుంటున్న బీఆర్ఆస్ శ్రేణులు

ఘనంగా విగ్రహాల ఊరేగింపు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని అమ్డాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రక్తమైసమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటిరోజు గ్రామంలో భక్తులతో కలిసి విగ్రహాల ఊరేగింపు పెద్దఎత్తున నిర్వహించారు. ఊరేగింపులో భక్తులు ఇళ్ల నుంచి బిందెలతో నీటిని తెచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో మూడురోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయని ఆలయ కమిటీ నిర్వాహకుడు గుంటం నర్సింహారెడ్డి తెలిపారు. భక్తులు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

షాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని ముద్దెంగూడ మాజీ ఉపసర్పంచ్ సామ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఏర్రోనిగూడలో ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మాజీ ఉపసర్పంచ్ పాల్గొని పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి గ్రామ దేవతకు నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

అందుబాటులో ప్రజాపాలన సేవా కేంద్రం

- ఎంపీడీఓ హిమబిందు



చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రం

చేవెళ్ల: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొననివారి వివరాలు నమోదు చేసుకునేందుకు మండల కేంద్రంలో ప్రత్యేకంగా ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేశామని ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో వివరాలు ఇవ్వనివారి కోసం ప్రభుత్వం ఈ నెల 28వ తేదీవరకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కేంద్రం ద్వారా సర్వేలో పాల్గొననివారు వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో దాదాపు 17,400లకు పైగా కుటుంబాలకు సర్వే జరిగిందన్నారు. అప్పుడు మండలంలో మొత్తం 36 ఇళ్లు మాత్రమే డోర్‌లాక్ అని వచ్చిందని చెప్పారు. వారితో పాటు ఇంకా ఎవరైనా మిగిలిపోయి సర్వేలో వివరాలు నమోదు చేసుకొనివారు ఉన్నా ఈ ప్రజాపాలన సేవా కేంద్రం ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు.

వైభవంగా శివాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయంలో రెండోరోజు సోమవారం ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యే క పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఉదయం పునఃపూజ, రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన అమ్మవారికి సహస్ర పుష్పార్చన, రుద్రహోమం, పూర్ణాహుతి, మంగళహారతి, అన్నదానం భజన కార్యక్రమాలు నిర్వహించారు. పుష్పార్చన, రుద్ర హోమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు చైర్మన్ సున్నపు వసంతం, మాణిక్యప్రభులు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఈ బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.



సహస్ర పుష్పార్చన నిర్వహిస్తున్న భక్తులు